## క్లుప్తంగా

### పోచమ్మ ఆలయంలో పూజలు



ధన్వాడ: పౌర్ణమి సందర్భంగా ఆదివారం భక్తులు పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని కోట పక్క వీధిలో ఉన్న అమ్మవారి ఆలయానికి ప్రతి ఇంటినుంచి నైవేద్యాలు తీసుకువెళ్లి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

### ఆత్మరక్షణకు కరాటే అవసరం

మక్తల్: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం విద్యార్థులకు కరాటే బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సలాబిన్ ఉమర్, అంబ్రేస్, లక్ష్మీనారాయణ, సత్యసాయి, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థికి సన్మానం



ఊట్కూరు: మండల కేంద్రానికి చెందిన వెంకట్రాములు, శ్యామల దంపతుల కుమారుడు ధనుష్ జాతీయ స్థాయి కరాటే పోటీలో గోల్డ్ మెడల్ సాధించడంతో ఆదివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఇటీవల గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 11ఏళ్ల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. కార్యక్రమంలో ఎంపీటీసీ హనుమంతు, నర్సింహ, కరుణాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### సర్పంచ్ మృతి



మక్తల్: మండలంలోని దాసర్‌దొడ్డి సర్పంచ్ గూళ్ల మారేప్ప(60) అనారోగ్యంతో బాధపడుతు ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, మహిపాల్‌రెడ్డి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### రోడ్డుకు మరమ్మతు



మరికల్: మండల కేంద్రం నుంచి వెంకటాపూర్ వరకు ధ్వంసమైన బీటీరోడ్డుకు మరమ్మతు చేపట్టారు. పదేళ్ల క్రితం వేసిన రోడ్డుపై టిప్పర్లు తిరగడం వల్ల మొత్తం ధ్వంసమైన నేపథ్యంలో చర్యలు తీసుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. కాగా ఇకపై ఈ దారిలో భారీ వాహనాలు తిరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే హెచ్చరించారు.

### తైక్వాండోను అభివృద్ధి చేయాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: మండలస్థాయిలో తైక్వాండోను అభివృద్ధి చేయాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్ అన్నారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.సాయిలు, సీనియర్ మాస్టర్ శంకర్ ఆధ్వర్యంలో బీపీహెచ్‌ఎస్‌లో వేసవి తైక్వాండో శిబిరంలో భాగంగా ఆదివారం ప్రత్యేక శిక్షణ నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని ఐదు జూనియర్ కళాశాలల్లో వివిధ సబ్జెక్టులలో తాత్కాలిక పద్ధతిన అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సమన్వ య అధికారి శ్రీవాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లిష్‌లో నాలుగు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీలో మూడు చొప్పున, తెలుగు, గణితం, బా టనీ, సైకాలజీలో రెండేసి, కామర్స్, సివిక్స్‌లో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు స ర్టిఫికెట్లతో ఈనెల 6న రాంరెడ్డి గూడెంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్–జేసీ(జీ) లో హాజరుకావాలన్నారు.

# ఏరువాక సాగారో రన్నో రైతన్న



ఊరేగింపులో ఆడుతున్న రైతు

మరికల్: స్థానిక పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకంగా ఆకుల పూజ చేపట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజారి వెంకటేశ్వర్ల శర్మ, రాజేశ్వర్‌రెడ్డి. శ్రీనివాస్, పుల్లయ్య, జగన్, పురుషోత్తంరెడ్డి, రామచంద్రయ్యగౌడ్, కృష్ణచారీ పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలో ఏరువాక పౌర్ణమి పండుగను ఆదివారం మండల ప్రజలు నిర్వహించారు. పశువులకు స్నానాలు చేయించి అందంగా ముస్తాబుచేసి ఊరేగింపు నిర్వహించారు. మండల కేంద్రంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో ఆనవాయితీ ప్రకారం మండల మాజీ ఎంపీపీ అంజయ్య, మాజీ వీఆర్‌ఓ సిద్ధన్న దూడలు ఏరువాకతాడును తెంపాయి. నిడ్జింతలో ఏరువాక పౌర్ణమిని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మసీదు కూడలి దగ్గర ఏరువాకతాడును గ్రామానికి చెందిన రైతులు దూడలు తెంపాయి. అలాగే మండల పరిధిలోని గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

దామరగిద్ద: మండలంలోని దామరగిద్ద, క్యాతన్‌పల్లి, మొగుల్‌మడ్క, లోకుర్తి, నర్సాపూర్ అన్నాసాగర్, విఠలపూర్, గత్ప, ఉల్లిగుండ, వత్తుగుండ్ల ముస్తాపేట్ తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాగా కాన్‌కుర్తిలో ఓ వ్యక్తి మరణించడంతో ఉత్సవాలు నిర్వహించలేదు.

కోస్గి: ఏరువాక పౌర్ణమి వేడుకలు గ్రామగ్రామాన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. బిజ్జారం, పోలేపల్లి, గుండుమాల్ గ్రామాల్లో ట్రాక్టర్లను అలంకరించి ఆలయాల చుట్టు ప్రదక్షిణలు చేశారు.

ధన్వాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. కేంద్రంలోని మారుతీనగర్ వీధిలో ఎద్దుల పరుగులను నిర్వహించారు. గ్రామ పంచాయతీ నుంచి ఎరువాక తాడును ర్యాలీగా తీసుకువచ్చి లక్ష్మీవాడలో ఎద్దులకు కట్టి తెంచారు.

మరికల్: మండలంలో అన్ని గ్రామాల్లో ఏరువాక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పరిమాళపురం పోల్కమ్మ ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చనలు చేపట్టారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఎద్దులను ఊరేగింపు నిర్వహించి ఏరువాక తాడు పోటీలు నిర్వహించారు.



తీలేర్ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

ఊట్కూరు: మండలంలో ఆదివారం ఏరువాక ఉత్సవాలను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. చిన్నపొర్ల, నిడుగుర్తి, పగిడిమారి, పులిమామిడి తదితర గ్రామాలలో రైతులు కాడెద్దులకు అలంకరించి శోభయాత్ర చేపట్టారు.

మాగనూర్: ఏరువాక పండుగ అంటేనే ఎద్దుల పండుగగా గ్రామీణ ప్రాంతల ప్రజలు భావిస్తారని వడ్వాట్ సర్పంచ్ నర్సింహులు అన్నారు. వడ్వాట్ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఏరువాక తాడు తెంపుడు పోటీలు ఘనంగా నిర్వహించారు.

మక్తల్: మండలంలోని వల్లభాపురంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని మృత్యుంజయ హోమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎద్దులను అలంకరణలు ఊరేగింపుతో చేపట్టారు.

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్, లంకాల్, ఉందేకోడ్, రాయికోడ్, రాంపూర్, కుమార్‌లింగంపల్లి గ్రామాల్లో ఏరువాకను ఆనందంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామాల ముఖ ద్వారాల వద్ద ఏరువాక తాడును కట్టి ఎద్దుల ఊరేగింపు నిర్వహించారు. తాడు తెగిన ఎద్దులను ఊరేగింపు చేపట్టారు.



మరికల్‌లో..



దామరగిద్దలో..



జిల్లా కేంద్రంలో ఎద్దులతో ఊరేగింపు..



పెద్దకడ్మూర్‌లో..



వడ్వాట్‌లో..



ఊట్కూరులో..



గార్లపల్లిలో..



ముక్తిపాడ్‌లో..

# మత్స్య సహకార సంఘం నాయకుల దీక్ష



దీక్షలో పాల్గొన్న నాయకులు

నారాయణపేట రూరల్ :కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరహారదీక్షలు 26వ రోజుకు చేరుకున్నాయి. మత్స్య సహకార సంఘం సభ్యులు ఆదివారం దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు కెంచె శ్రీనివాసులు, బి.రాము మాట్లాడుతూ.. కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ విజయలక్ష్మి, నర్సింహులు, చెన్నప్ప, హాజిమలాంగ్, కొంగరి రాములు, సంఘం సభ్యులు శ్రీనివాస్, కాశప్ప, లక్ష్మయ్య, కుర్మయ్య, నాగప్ప, దస్తప్ప, చంద్రప్ప, కేశవులు, తిర్మలేష్, నర్సింహులు, రాజు పాల్గొన్నారు.

# ఓబీసీ సాధనే లక్ష్యం



జిల్లా నుంచి బయలుదేరి వెళ్తున్న వీరశైవులు

నారాయణపేట రూరల్ : ఓబీసీ సాధనే లక్ష్యంగా వీరశైవ లింగాయత్– లింగబలిజలు ముందుకు పోతున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గందెర వికాంత్ అన్నారు. హైదారాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మహార్యాలీకి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. పట్టణ సమాజం ఆధ్వర్యంలో స్థానిక శివలింగేశ్వరస్వామి ఆలయంలో మాట్లాడుతూ.. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవతో తెలుగురాష్ట్రంలో బీసీలుగా గుర్తించారని, నేడు కేంద్రం ఓబీసీ జాబితాలోకి చేరిస్తే ఎంతోమంది బీద విద్యార్థులకు లాభం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ల్యాబ్‌శివకుమార్, అవుటిశివరాజ్, అక్కంచిరావికుమార్, బర్మనాగభూషణం, మల్లికార్జున్, శంకర్‌బాబు, లిఖిరఘుబాబు, సచిన్ మంగల్గి, కన్నజగదీష్, సురేందర్, రవి, అనిల్ పాల్గొన్నారు.



ధన్వాడ: వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలని జిల్లా చీఫ్ అడ్వైజర్ శ్రీశైలం అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహా ర్యాలీకి మండల కేంద్రం నుంచి వీరశైవ లింగాయత్‌లు తరలివెళ్లారు. అవుటిసూరి, శివకుమార్, రాజు, విరేష్, నారాయణస్వామి, కోటేశ్వర్ తదితరులు ఉన్నారు.

# ఎస్పీ బాలు జయంతి

నారాయణపేట రూరల్ : ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని స్థానిక బాలకేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుదర్శన్ పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ బాలు పాడిన పలు పాటలను పలువురు గాయకులు ఆలపించారు. వారిని శాలువా, పూలమాల, జ్ఞాపికతో సన్మానించారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు, ఐస్‌క్రీమ్‌లను పంపిణీ చేశారు. మరికల్ సీఐ శ్రీకాంత్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు ఆత్మారాం, సరాఫ్‌నాగరాజు, సీపీఎం నాయకులు వెంకట్రామారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చెన్నారెడ్డి, సుభాష్, జ్ఞానేశ్వర్‌గౌడ్, బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, సంగ నర్సింహులు, రామకృష్ణ, శ్రావణి, వసంత్, ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



చిన్నారులకు నోటుపుస్తకాలు అందిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

# సామూహిక సత్యనారాయణ వ్రతం



సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

మరికల్: మండలంలోని పల్లెగడ్డ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఉత్తరపల్లి రామచార్యులు భక్తులతో వ్రతం చేయించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శ్రీరాములు, కుర్మన్న, పాండు, సుజాత పాల్గొన్నారు.

# కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు పొందిన విద్యార్థులతో నర్సిములు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ ఉపాధ్యక్షులు, సీనియర్ మాస్టర్ కె.నర్సిములు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అసోసియేషన్ విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్‌బెల్టు మాస్టర్ కె.అక్షయ, వెంకట్రాంరెడ్డి, దేవరాం, జి.శ్రీను, హరి, రామాంజనేయులు, సాంబశివుడు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

### రైల్వే ప్రమాద మృతులకు నివాళి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఒడిశాలో జరిగిన రైల్వే ప్రమాద మృతులకు పాలమూరు యూనివర్సిటీలో ఆదివారం పుటా ఆధ్వర్యంలో ఒప్పంద అధ్యాపకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. బాధిత కుటుంబాలు మనోధైర్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (పుటా) నాయకులు భూమయ్య, రవికుమార్, అర్జున్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, రాజ శేఖర్, గాలన్న, సూర్యం పాల్గొన్నారు.

# ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌స్తంభం

మాగనూర్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ఓ పొలంలో విద్యుత్ స్తంభాలు విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రస్తుతం వానాకాలం మొదలు అవుతుండటంతో అన్నదాతలు వ్యవసాయ పనులు మొదలు పెట్టారు. దీంతో పొలం మధ్యలో ప్రమాదకరంగా ఉన్న స్తంభంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందన్న భయంగా పనులు సాగిస్తున్నారు. ఈ విషయంపై గతంలోనే అనేక సార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని రైతులు తెలిపారు.

# పాలమూరు కవుల జిల్లా




వేగుచుక్క కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ప్రముఖ కవి కె.లక్ష్మణ్‌గౌడ్ రచించిన 'వేగుచుక్క' కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. పాలమూరు కవుల జిల్లా అన్నారు. ఒకప్పుడూ పాలమూరు జిల్లా అంటే వలసల ఖిల్లా అని పేరుండేదని, ఇప్పుడు ఇక్కడికే వలసలు వస్తున్నారని అన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మణ్‌గౌడ్ కవిత్వంలో విభిన్న వస్తువులు కన్పిస్తాయన్నారు. తనదైన శైలిలో కవిత్వం రాయడం ప్రత్యేకతన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ సమాజంలో మార్పును తీసుకురాడానికి కవిత్వం దోహదం చేస్తుందన్నారు. ప్రముఖ న్యాయవాది వి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మణ్‌గౌడ్‌ను కొనియాడారు. కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డి సభకు అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని ప్రముఖ కవి ఘనపురం దేవేందర్ సమీక్ష చేశారు. కార్యక్రమంలో పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, జగపతిరావు, డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, బాదేపల్లి వెంకటయ్యగౌడ్ తదితర కవులు, రచయితలు పాల్గొన్నారు.

**క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి..**

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో మాస్టర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో ఆదివారం కింగ్‌షోటోకాన్ కరాటే డూ ఇండియా 25వ వేసవి ఉచిత శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మంచి ఆరోగ్యం కోసం క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. జహంగీర్‌పాష ఖాద్రీ 25 ఏళ్ల నుంచి వేలాదిమందికి కరాటే శిక్షణ ఇస్తుండడం అభినందనీయమని అన్నారు. జిల్లా కేంద్రంలో పెద్ద పెద్ద కంపెనీలు వస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆరు మైనార్టీ గురుకులాలు, కళాశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1000 గజాల స్థలంతోపాటు రూ.10లక్షలు కేటాయిస్తానని తెలిపారు. ఇక్కడ పోలీస్, ఎస్ఐ పరీక్షలు రాసే అభ్యర్థులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. ముగింపు వేడుకల సందర్భంగా విద్యార్థుల కరాటే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వేసవి కరాటే శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, జేపీఐటీఐ అధ్యక్షుడు జఫర్‌షా, కౌన్సిలర్లు, ఈద్గా కమిటీ అధ్యక్షులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

# పంచాయతీలకు కొత్త కళ

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పంచాయతీల భవనాలు
- 4 గ్రామాల్లో పనులు ప్రారంభం



కొనసాగుతున్న పంచాయతీ భవనం పనులు

మాగనూర్: ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం చిన్న గ్రామాలను, తండాలను పంచాయతీలుగా గుర్తించింది. కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసినా వాటికి పక్కా భవనాలు నిర్మించకపోవడంతో గత్యంతరం లేక అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో కొనసాగించాల్సిన పరిస్థితి. దీంతో గ్రామసభలు, పాలకవర్గ సమావేశాలు, పంచాయతీల నిర్వహణ కష్టతరంగా మారింది. వీటికి తోడు కొన్ని పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయో తెలియని దుస్థితి. ఈ ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం శాశ్వత భవనాలు నిర్మించాలని తలపించింది.

**మండలంలో ఇలా..**

పంచాయతీ భవనాలకు రూ.కోటీ60 లక్షలతో మండలంలోని 8 పంచాయతీలకు భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో దాని నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.20 లక్షల వెచ్చించింది. ఇప్పటికే నాలుగు గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే మరో 4 పంచాయతీల్లో ప్రారంభించేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.


**కొత్త పంచాయతీలకు..**

మండలంలోని 7 కొత్త పంచాయతీలుగా ఆవిర్భవించాయి. అదేవిధంగా 8 పంచాయతీల భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు పంపడంతో ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

**అధునాతన సౌకర్యాలతో..**

అధునాతన సౌకర్యాలతో ఆరు నెలల్లోపు పంచాయతీల్లో పక్కా భవనాలను నిర్మించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూన్ రెండవ వారంలోపు మిగిలిన పనులు ప్రారంభించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో భవనాన్ని వెయ్యి చదరపు గజాల స్థలంలో నిర్మించనున్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి ప్రత్యేక గదులు, స్టోర్‌రూమ్, సమావేశ మందిరం, కంప్యూటర్ గది, మల్టీ పర్పస్‌రూం, పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


**సంతోషంగా ఉంది..**



మండలంలోని బైరంపల్లి పంచాయతీగా ఆవిర్భవించడం కార్యకలాపాలు తాత్కాలికంగా ఓ ప్రైవేట్ భవనంలోని గదిలో నిర్వహిస్తున్నాం. ఇబ్బందుల నడుమ సమావేశాలు, ఇతర కార్యక్రమాలు పూర్తి చేస్తున్నాం. ప్రభుత్వం పంచాయతీ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించడం సంతోషంగా ఉంది. ఇప్పటికే స్థలం గుర్తించి భూమిపూజ కార్యక్రమం పూర్తి చేసుకున్నాం.

– మంజుల, సర్పంచ్, బైరంపల్లి

**పనులు వేగవంతంగా..**



మండలంలో ప్రస్తుతం నాలుగు పంచాయతీ భవనాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మిగతా వాటిని కూడా ఈ నెల రెండో వారంలో ప్రారంభిస్తాం.

– విలోక్, ఏఈ పంచాయతీ రాజ్, మాగనూర్